క్లుప్తంగా

కంటైనర్లలో తిరుపతికి ఈవీఎంల తరలింపు



కంటైనర్లలో తరలిస్తున్న ఈవీఎంలు

సూళ్లూరుపేట: నియోజకవర్గంలోని ఆరు మండలాలకు కలిపి 304 ఈవీఎంలు, వీవీ ప్యాట్స్, ఇతర ఎన్నికల నిర్వహణ సామగ్రిని భద్రత మధ్య మంగళవారం మధ్యాహ్నం 2 గంటల ప్రాంతంలో మూడు కంటైనర్లలో తిరుపతి పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయానికి తరలించారు. అయితే నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణ ఆలస్యం కావడంతో మంగళవారం తెల్లవారుజామున 5 గంటలకు ఈవీఎంలను ఎన్నికల నిర్వహణ సిబ్బంది సూళ్లూరుపేటకు తీసుకొచ్చి ఎన్నికల అధికారికి సమర్పించారు. అక్కడి నుంచి భద్రత మధ్య మూడు కంటైనర్లలో తిరుపతికి తీసుకెళ్లి జిల్లా ఎన్నికల అధికారికి అప్పగించారు.

విగ్రహం ధ్వంసంపై నిరసన



నిరసన తెలుపుతున్న నేతలు

వెంకటగిరిరూరల్: పట్టణంలోని రాణిపేట సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని ఆగంతకులు ధ్వంసం చేయడంపై దళిత ప్రజాసంఘాల నేతలు మానవహారంగా ఏర్పడి క్రాస్‌రోడ్డు కూడలిలో నిరసన వ్యక్తం చేశారు. నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ గంటపాటు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. దీంతో క్రాస్‌రోడ్డు సమీపంలోని నాలుగువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలిసి ఎస్‌ఐ జిత్యానాయక్ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. ఆందోళనకారులతో చర్చించి చర్యలు తీసుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనకు తెరపడింది.

డీవీసత్రం వైపు అందరిచూపు



పోలిరెడ్డిపాళెంలో బారులుతీరిన మహిళలు

దొరవారిసత్రం: సూళ్లూరుపేట నియోజకవర్గంలోనే 2014 సంవత్సరం సార్వత్రిక ఎన్నికల్లో రెండవ స్థానం (3,614ఓట్లు), 2019లో మొదటి స్థానం (9,526ఓట్లు)లో అత్యధిక ఓట్లు వైఎస్సార్‌సీపీకి ఓట్లు పోలైన విషయం తెలిసిందే. అదే తరహాలో ఇప్పుడు నిర్వహించిన ఎన్నికల్లో కూడా అధిక ఓట్లు పోల్ అవుతాయని ఇటు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతలు సమీక్షించుకుంటూ లెక్కలు వేసుకుంటున్నారు. జగనన్న సంక్షేమం వైపు మొగ్గు చూపిన మహిళలు పలు పోలింగ్ కేంద్రాల్లో ఓట్లు వేసేందుకు బారులు తీరారు. 2014 ముందు వరకు డీవీ సత్రం మండలం టీడీపీకి కంచుకోటగా పేరుంది.

కండలేరులో 6.813 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం 6.813 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్‌రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 220 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 5, లోలెవల్ కాలువకు 70 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మళ్లీ ఫ్యాన్ ప్రభంజనమే!



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- ఎన్నికల్లో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు
- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్: సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టారని, ఈసారి కూడా వైఎస్సార్‌సీపీ ప్రభంజనం సృష్టించబోతుందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ ఫలాలు, మంచితో రాష్ట్ర ప్రజలు మరోసారి అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. జూన్ 4న వెలువడనున్న ఎన్నికల ఫలితాల్లో అత్యధిక స్థానాలు వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకుని విశాఖపట్నంలో ప్రమాణ స్వీకారం చేయబోతున్నారని జోస్యం చెప్పారు. వెంకటగిరి నియోజకవర్గంలో 80 శాతం ఓట్లు పోలైనట్లు తెలిపారు. ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త, నేతలు తన గెలుపుకోసం కృషిచేశారని, అదేవిధంగా వలంటీర్లు రాజీనామా చేసి పార్టీకోసం పనిచేసినట్లు పేర్కొన్నారు. వారికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా ఉండనున్నట్లు తెలిపారు.

ఓటమి భయంతోనే టీడీపీ నేతల అల్లర్లు....

రాష్ట్రంలో ఓటమి భయంతోనే టీడీపీ నేతలు అలర్లకు పాల్పడుతున్నట్లు నేదురుమల్లి చెప్పారు. దీంతో పలుచోట్ల వివాదాలకు తెరలేపుతూ, విధ్వంసాలు సృష్టిస్తున్నట్లు ఆరోపించారు. పట్టణంలోని రాణిపేట సమీపంలోని అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం హేయమైన చర్యని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు నేదురుమల్లి తెలిపారు. ఆ ప్రాంతంలో అంబేడ్కర్ భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు.

జగన్ సీఎం కావడం ఖాయం

- జగనన్నే మళ్లీ సీఎం
- కిలివేటి సంజీవయ్య



కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ఎండను సైతం లెక్కచేయక అధికసంఖ్యలో ప్రజలు క్యూలో నిలబడి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని, మళ్లీ కాబోయే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని సూళ్లూరుపేట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కిలివేటి సంజీవయ్య అన్నారు. పట్టణంలోని సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో మంగళవారం మాట్లాడారు. నియోజవర్గ పరిధిలోని అన్ని మండలాలకు చెందిన పార్టీ శ్రేణులందరూ కలిసికట్టుగా ఎన్నికల రోజున పనిచేశారన్నారు. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకునేందుకు నిర్ణయించుకున్నారని పోలింగ్ సరళిబట్టి తెలిసిపోతోందన్నారు. మేము సైతం జగనన్నకు తోడుగా అన్నట్లుగా ప్రజలు తరలివచ్చి ఓట్లు వేశారన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకోవడం తథ్యమన్నారు.

ప్రతిఒక్కరికీ రుణపడి వుంటా..

వైఎస్సార్‌సీపీ విజయం కోసం పార్టీ జెండాను మోసిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానని సంజీవయ్య అన్నారు. జగనన్నను మళ్లీ సీఎం చేసుకునేందుకు పార్టీ శ్రేణులు, అభిమానులు, సైనికుల్లా పనిచేశారన్నారు. నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల నేతలు, కార్యకర్తలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పుకు టీడీపీ తలవంచక తప్పదన్నారు. నియోజవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన నేతలు మంగళవారం సంజీవయ్యను కలిసి ఆయన సహా, ఎంపీ అభ్యర్థి గురుమూర్తి విజయం తథ్యమని చెప్పారు.

18 నుంచి చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఊరందూరులో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి 28వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు జరగనున్నట్లు ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 18న అంకురార్పణ, 19న ధ్వజారోహణం, 23న గరుడ సేవ, 24న కల్యాణోత్సవం, గజవాహన సేవ, 25న వసంతోత్సవం, రాత్రి రథోత్సవం, 26న రాత్రి పల్లకీసేవ, 27న పార్వేట ఉత్సవం, సాయంత్రం ధ్వజావరోహణం, 28న శాంతి అభిషేకం, రాత్రి ఏకాంత సేవలో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. భక్తులు పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన



మాట్లాడుతున్న జడ్జిలు రాఘవేంద్ర, జానకి

పుత్తూరు: న్యాయవాదులు మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీనియర్ సివిల్‌జడ్జి ఎస్.సీ.రాఘవేంద్ర సూచించారు. మంగళవారం స్థానిక సబ్‌కోర్టులో న్యాయవాదులకు న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మధ్యవర్తిత్వం చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ వ్యాజ్యం కంటే మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కారించుకోవడం ద్వారా సంతృప్తికరమైన ఫలితం పొందవచ్చని వివరించారు. మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించబడిన కేసుల్లో కోర్టు ఫీజులను వాపసు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. మధ్యవర్తిత్వం ద్వారా కక్షిదారులకు ఆందోళన తగ్గి, మనశ్శాంతి కలుగుతుందన్నారు. అడిషనల్ జూనియర్ సివిల్‌జడ్జి జానకి మాట్లాడుతూ జూన్ 29న కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఇందుకు న్యాయవాదులు కక్షిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. సదస్సులో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పురుషోత్తం, కార్యదర్శి మురళి, న్యాయవాదులు పాల్గొన్నారు.

దళితులపై టీడీపీ దాష్టీకం



తిమ్మసముద్రంలో ఘర్షణ దిగుతున్న టీడీపీ కార్యకర్తలు

గూడూరురూరల్: నియోజకవర్గంలో సోమవారం రాత్రి 10.30 వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. మొత్తం 2,45,205 మంది ఓటర్లు ఉండగా 1,93,430 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో 95,535 మంది పురుషులు, 97,880 మంది మహిళలు, 15 మంది ట్రాన్స్‌జెండర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. దీంతో నియోజకవర్గంలో 78.89 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు.

టీడీపీ కవ్వింపు చర్యలు..

సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభపెట్టడంతో పాటు పలుచోట్ల టీడీపీ శ్రేణులు కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. మండలంలోని పాలిచెర్ల, తిమ్మసముద్రం గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల క్యూల వద్ద కొందరు టీడీపీ నాయకులు ప్రచారం చేయడాన్ని వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో కొద్దిసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. తిమ్మసముద్రం గ్రామంలో పోలింగ్ బూత్ వెలుపల



టీడీపీ శ్రేణులు ఘర్షణకు దిగారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఇద్దరు దళిత యువకులపై టీడీపీ శ్రేణులు దాడికి పాల్పడ్డారు. ఓటింగ్ శాతం పెరగడంతో ఎలాగైనా పోలింగ్ శాతాన్ని తగ్గించేందుకు టీడీపీ కుట్రలు పన్ని పలుచోట్ల ఘర్షణలు, తోపులాటలు, వాగ్వాదాలకు దిగారు. వీటిని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు దీటుగా తిప్పికొట్టడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు.

గెలుపుపై వైఎస్సార్‌సీపీ నేతల ధీమా



నేదురుమల్లితో నేతలు

వెంకటగిరి(సైదాపురం): పట్టణంలోని నేదురుమల్లి నివాసం మంగళవారం వైఎస్సార్‌సీపీ నేతలతో కోలాహలంగా మారింది. సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలోని వెంకటగిరి పట్టణం, రూరల్, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం, రాపూరు, కలువాయి మండలాల్లో 80 శాతం పోలింగ్ నమోదైంది. ఈ మేరకు నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులు నేదురుమల్లి నివాసం వద్దకు చేరుకుని ఆయనను కలిసి గెలుపుపై తమ ధీమా వ్యక్తం చేశారు.

మేరిగను కలిసిన చిల్లకూరు నేతలు



మేరిగతో నేతలు

చిల్లకూరు: వైఎస్సార్‌సీపీ గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేరిగ మురళీధర్‌ను మంగళవారం గూడూరులోని ఆయన నివాసంలో చిల్లకూరు మండలంలోని నేతలు కలుసుకున్నారు. సోమవారం పోలింగ్ ప్రకియ రాత్రి వరకు కొనసాగడంతో ఆయా గ్రామాల్లోని వివరాలు పూర్తిగా తెలియరాలేదు. దీంతో నాయకులు ఉదయం మేరిగను ఆయన నివాసంలో కలుసుకుని పోలింగ్ జరిగిన తీరుతెన్నులను వివరించారు. అటు తరువాత మహిళా ఓటర్ల చైతన్యం బాగా ఉందని దీంతో విజయవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. మేరిగ మురళీధర్ మాట్లాడుతూ ఎన్నికల్లో పార్టీ విజయానికి కృషిచేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండల పార్టీ అధ్యక్షుడు యద్దల మధుసూదన్‌రెడ్డి, బుర్లా విష్ణువర్ధన్‌రెడ్డి, యరటపల్లి శరణ్‌కుమార్‌రెడ్డి, మనోజ్‌రెడ్డి, చిట్టేటి నారాయణ, దువ్వూరు, దిలీప్‌రెడ్డి, కట్టా రామచంద్రారెడ్డి, రామిరెడ్డి, కనపర్తి దిలీప్‌రెడ్డి, యల్లంటి ప్రభాకర్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, కట్టా రవీంద్రరెడ్డి, నాగిశెట్టి శారదమ్మ, సుబ్బరాయులు, జయశేఖరరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ బెదిరింపులకు భయపడం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మేరిగ మురళీధర్

– విలేకర్ల సమావేశంలో మేరిగ మురళీధర్

గూడూరురూరల్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో పార్టీ కోసం పనిచేసిన పార్టీ శ్రేణులు ప్రతిఒక్కరికీ వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ అభ్యర్థి మేరిగ మురళీధర్ ధన్యవాదాలు తెలిపారు. పట్టణంలోని సనత్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మేరిగ మాట్లాడారు. గతంలో కంటే సోమవారం జరిగిన ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరగడంతో ఓటమి భయం పట్టుకున్న టీడీపీ శ్రేణులు ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద అరాచకాలు సృష్టించేందుకు ప్రయత్నించారన్నారు. ఇందులో భాగంగానే చిల్లకూరులో వైఎస్సార్‌సీపీ నాయకులపై దాడులకు తెగబడ్డారని తెలిపారు. అక్కడ బీభత్సం సృష్టించే ప్రయత్నంలో కొంతమంది టీడీపీ వర్గీయులు రాళ్లు, కర్రలు, డీజిల్ తీసుకొచ్చి తగలబెట్టే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న టీడీపీ అభ్యర్థి పాశం సునీల్‌కుమార్ 200 మంది తన అనుచరులతో అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. దీంతో ఆపేందుకు ఎస్‌ఐ అంజిరెడ్డి ప్రయత్నించే క్రమంలో సునీల్ చేయిపట్టుకుంటే దానిపై కులం పేరుతో దూషించాడంటూ కేసులు నమోదు చేయాలని ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పాశం సునీల్‌కుమార్‌కు ఎదురుగా తాను కూడా అక్కడే ఉన్నానని, ఎస్‌ఐ అంజిరెడి, సునీల్ మధ్య ఎలాంటి మాటలు జరగకనే దూషించాడని ఎలా ఫిర్యాదు చేస్తావంటూ ప్రశ్నించారు. నీకు నమ్మకమైన చర్చి, మసీదు, దేవాలయాల్లో ప్రమాణం చేసేందుకు సిద్ధంగా ఉన్నావా అంటూ సవాల్ విసిరారు. దీనిపై కులసంఘాల నాయకులు కూడా ఆలోచన చేయాలన్నారు. ఏది ఏమైనప్పటికీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. ఎవరైనా కార్యకర్తల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదంటూ హెచ్చరించారు. ఎన్నికల ఓటింగ్ శాతం పెరగడంలో ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. మండల కన్వీనర్ మల్లు విజయకుమార్‌రెడ్డి, ఎంపీపీ గురవయ్య, జిల్లా అధికార ప్రతినిధి నాసిన నాగులు, 24 సొసైటీ అధ్యక్షుడు అట్ల శ్రీనివాసులు రెడ్డి, మాజీ కౌన్సిలర్లు తాళ్లూరు శ్రీనివాసులు, భానుప్రకాష్, దాసరి వెంకటేశ్వర్లు, వాయుగండ్ల నాగరాజు, అల్తాఫ్, గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఓటెత్తిన చైతన్యం

- వెంకటగిరిలో 80.07 శాతం



భారీ సంఖ్యలో బారులు తీరిన మహిళలు

వెంకటగిరి (సైదాపురం): సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు పోటెత్తారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వెంకటగిరి నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా, ఏ పోలింగ్ కేంద్రాల్లో చూసినా ఓటర్లు బారులు తీరిన దృశ్యాలే కనిపించాయి. సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ముగిసింది. కానీ నిర్ణీత సమయంలోపు క్యూలో ఉన్న ఓటర్లకు రాత్రి ఎంత సమయమైనా ఓటింగ్‌కు అనుమతించారు. రాత్రి 10గంటలకు ఓటింగ్ ముగిసింది. ఈవీఎంలను స్ట్రాంగ్ రూములకు తరలించారు. వెంకటగిరి 78.11, కలువాయిలో 79.42, రాపూరులో 76.56, సైదాపురం 82.67, బాలాయపల్లి 87.03, డక్కిలి 85.96 శాతం మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 2లక్షల 43వేల 582 మంది ఓటర్లు ఉండగా సోమవారం జరిగిన ఎన్నికల్లో లక్ష 96వేల 986 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినిగించుకున్నారు. దీంతో నియోజకవర్గంలో 80.87 శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. ప్రధానంగా పురుషుల కన్నా మహిళలే అధికం సంఖ్యలో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో 97,799 మంది పురుషులు ఓటును సద్వినియోగం చేసుకోగా మహిళలు 99,184 మంది ఓటు వేశారు.

సూళ్లూరుపేటలో 82.32 శాతం

సూళ్లూరుపేట: నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో సోమవారం జరిగిన పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికల్లో 82.92 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ కేంద్రాల్లో కొన్ని చోట్ల ఈవీఎంలు మొరాయింపు, సాంకేతిక పరమైన ఇబ్బందులు తలెత్తడంతో మంగళవారం తెల్లవారుజామకు నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి ఈవీఎంలను, పోలింగ్ సిబ్బంది సూళ్లూరుపేటకు చేరుకుని సామాగ్రిని అప్పగించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 304 కేంద్రాల్లో 2,42,610 మంది ఓటర్లుకుగాను 2,01,179 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 82.92 పోలింగ్ శాతం నమోదైంది. సూళ్లూరుపేట, నాయుడుపేటలో రాత్రి 10 గంటల దాకా పోలింగ్ నిర్వహించారు. నియోజకవర్గంలో మహిళలు ఎక్కువశాతం ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో కంటే ఈ ఎన్నికల్లో 9,959 ఓట్లు మాత్రమే పెరిగాయి. పెరిగిన మహిళా ఓట్ల కారణంగా ఇవి వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు చూపుతుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

డక్కిలిలో 86శాతం

డక్కిలి: మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో 86శాతం ఓట్లు నమోదయ్యాయి. పోలింగ్ వివరాలను తహసీల్దార్, ఎన్నికల సహాయ అధికారి శ్రీనివాస్ మంగళవారం వెల్లడించారు. మండల పరిధిలో 42 పోలింగ్ కేంద్రాలున్నాయి. మండలంలో మొత్తం 33,174ఓట్లకుగాను 28,516 ఓట్లు పోలయ్యాయి. ఇందులో పురుషులు 14,283మంది, మహిళలు 14,232మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అత్యధికంగా 210 పోలింగ్ కేంద్రంలో 91శాతం మంది ఓటర్లు తమ ఓటును వినియోగించుకున్నారు. ఇక 190, 202, 208, 211పోలింగ్ కేంద్రాల్లో 90శాతం మంది ఓటర్లు తమ ఓటును సద్వినియోగం చేసుకున్నారు. అత్యల్పంగా 187 పోలింగ్ కేంద్రంలో 79శాతం మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.



సూళ్లూరుపేట ప్రభుత్వ హైస్కూల్‌లో ఓటర్లు



డక్కిలిలో బారులు తీరిన ఓటర్లు

ఓటమి భయంతో టీడీపీ దాడులు

–కవ్వింపు చర్యలకు పాల్పడిన టీడీపీ శ్రేణులు

చిల్లకూరు: ప్రశాంతంగా సాగిపోతున్న పోలింగ్‌లో అలజడులు సృష్టించేందుకు టీడీపీ శ్రేణులు శ్రీకారం చుట్టారు. దీంతో పలు పోలింగ్ కేంద్రాలలో పోలింగ్ ఏజెంట్లతో గిల్లికజ్జాలు పెట్టుకునేందుకు సిద్ధమై ఘర్షణ వాతావరణం కలగించేలా ప్రవర్తించిన తీరును ప్రజలు చీదరించుకుంటున్నారు. గూడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగాలంటే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో ఉండాలని వృద్ధులు, దివ్యాంగులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. దీంతో గతంలో కన్నా ఓటింగ్ శాతం పెరుగుతుండడంతో ఒక్కసారిగా టీడీపీ శ్రేణుల్లో ఓటమి భయం పట్టుకుంది. దీంతో ఓటింగ్ ప్రక్రియను ఆపాలంటే కొత్త ఎత్తుగడలకు తెర తీసి కవ్వింపు చర్యలుకు పాల్పడడం మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే పలు పోలింగ్ కేంద్రాలలో చిన్న పాటి ఘర్షణలు చోటుచేసుకున్నాయి.చిల్లకూరులోని ప్రధాన పోలింగ్ కేంద్రాలైన దర్గా సమీపంలోని పోలింగ్ కేంద్రంలోకి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లగా అక్కడ ఉన్న టీడీపీ ఏజెంట్లు ఆయన్ను అడ్డుకుని వివాదానికి దిగారు. దీంతో వివాదాలకు తావివ్వకుండా అక్కడ నుంచి మేరిగ మురళీధర్ చిల్లకూరులోని జెడ్పీహైస్కూల్‌లోని పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లారు. అక్కడ టీడీపీ ఏజెంట్లు వారి గుర్తును చూపిస్తూ కేంద్రంలోనే ప్రచారం చేయడం గమనించిన మురళీధర్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో రెచ్చిపోయిన టీడీపీ శ్రేణులు ఘర్షణకు దిగారు. దీంతో ఒక్కసారిగా అక్కడ వంద మందికి పైగా గుమిగూడి రచ్చరచ్చ చేశారు. ఈలోగా టీడీపీ అభ్యర్థిగా ఉన్న పాశం సునీల్ కుమార్ మరో 200 మందితో అక్కడకు చేరుకోవడంతో అరుపులు, కేకలతో భయాందోళనలు సృష్టించారు. వారిలో కొంత మంది యువకులు రాళ్లు, కర్రలతో దాడి చేసే ప్రయత్నంచడంతో పాటు వాటర్ బాటిళ్లలో పెట్రోల్, డీజిల్ తీసుకొచ్చి చల్లి భయపెట్టారు. ఇది గమనించిన పోలీసులు వారిని చెదర గొట్టి ఇరువర్గాలను అక్కడ నుంచి పంపి వేశారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాల వద్ద కూడా టీడీపీ శ్రేణులు ఓటమి భయం పట్టుకుని వైఎస్సార్‌సీపీ శ్రేణులపై దాడులకు పాల్పడేందుకు ప్రయత్నించారు.



వాటర్ బాటిల్‌లోని పెట్రోల్‌ను చల్లుతుకున్న టీడీపీ కార్యకర్తలు